చిరు ధాన్యాల ప్రాధాన్యత తెలపాలి

పార్వతీపురం: చిరు ధాన్యాల ప్రాధాన్యత తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్.జవహర్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్లతో గురు వారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు ధాన్యాల ప్రాధాన్యత తెలియజేయుటకు కలెక్టరు కార్యాలయంతో పాటు వివిధ ప్రదేశాల్లో దుకాణాలు ఏర్పాటు చేయడం, వివిధ కార్యక్రమాల్లో ప్రధానంగా వినియోగించడం చేయాలని తద్వారా ప్రజల్లోకి సమాచారం వెళుతుందన్నారు. మే 31 నాటికి గృహాల నిర్మాణంలో సాధ్యమైనంత ఎక్కువ ప్రగతి సాధించాలని అన్నారు. స్పందన కార్యక్రమంలో పరిష్కరించిన దరఖాస్తులు మరల వస్తున్నాయని, వాటిపై దష్టి సారించాలని ఆయన అన్నారు. గృహ నిర్మాణ సంస్థ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు చేయడంలో జిల్లా మంచి ప్రగతి చూపిందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్, డిఆర్ఓ జె.వెంకట రావు, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మన్యంలో ప్రాథమిక విద్య మెరుగుపడేనా?

- పెండింగ్ పనులు పూర్తయ్యేదెప్పుడో...?
- నేడు ఏజెన్సీలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ పర్యటన

ప్రజాశక్తి -సీతంపేట

మన్యంలో ప్రాథమిక విద్య అస్తవ్యస్థంగా ఉంది. పక్కా భవనాలు లేకపోవడం, ఏకోపాధ్యాయుల వల్ల గిరిజన విద్యార్థుల చదువులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక విద్య ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వకపోవడంతో చాలామంది గిరిజన విద్యార్థులు బడులకు దూరంగా ఉంటూ డ్రాప్స్అవుట్‌గా మారుతున్నారు. ఇప్పటికే ఐటిడిఎ పరిధిలో ఏకోపాధ్యాయులతోనే పాఠశాలలను నెట్టికొస్తున్నారు. మరో పక్క ఉపాధ్యాయ నియామకం లేకపోవడంతో పాఠశాలలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయులతో నడుస్తున్నాయి. సీతంపేట ఐటిడిఎ పరిధిలో 252 ప్రాథమిక పాఠశాలలో మంజూరు కాగా వీటిలో 192 పాఠశాల ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. ప్రతి పాఠశాలలో 20 మంది విద్యార్థులకు తక్కువ కాకుండా ఆ గ్రామంలో పదిమంది విద్యార్థులున్నా పాఠశాల నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఉపాధ్యాయ నియామకాలు లేకపోవడంతో విద్యార్థులు బడికి రాకపోవడం వల్ల చాలాచోట్ల పాఠశాలలు మూసివేసే పరిస్థితి నెలకొంది. ప్రతి పాఠశాలకు శాశ్వత భవనం కల్పించాల్సి ఉన్నా ఆ స్థాయిలో భవనాల్లేకపోవడం, శిథిలమైన భవనాలకు నాడు-నేడు పథకం కింద నిధులు మంజూరు చేసి పాత భవనాలు మెరుగుపర్చాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. నాడు-నేడు 1,2 విడదల కింద మండలంలో శిథిలమైన పాఠశాల భవనాలను గుర్తించారు. అయినప్పటికీ వాటి మరమ్మతులకు అవసరమైన నిధులు కేటాయించకపోవడంతో మొదటి విడత కొన్ని పాఠశాలల పనులు అర్థాంతరంగా నిలిపివేశారు. రెండో విడత కింద 38 పాఠశాలల మరమ్మతులకు కోటి రూపాయలు మేరకు నిధులు మంజూరు చేయగా, మిగిలిన పాఠశాలను విడిచిపెట్టేశారు. దీంతో రేకుల షెడ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారు.

నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన పాఠశాల

వేధిస్తున్న ఉపాధ్యాయుల సమస్య

ఐటిడిఎ పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలోదు. ఐటిడిఎఉప విద్యాశాఖ అధికారి పోస్టు నాలుగేళ్లుగా ఖాళీగా ఉంది. అలాగే 57ఎస్‌జిటి పోస్టులు, 47 ఆశ్రమ పాఠశాలల్లోని కుక్, కమాటి, వాచ్‌మెన్, స్వీపర్ పోస్టులు, మరో 96 నాలుగో తరగతి సిబ్బంది పోస్టులు ఖాళీలు ఉన్నాయి. మూడేళ్లక్రితం ప్రవీణ్ ప్రకాష్ సిఎం వ్యక్తిగత కార్యదర్శి హెూదాలో సీతంపేట ఏజెన్సీలో సీతంపేట, పెద్దూరు గ్రామాలను సందర్శించి, పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను, సచివాలయాల నిర్మాణాలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో మళ్లీ శుక్రవారం ఆయన సీతంపేట ఏజెన్సీ పర్యటించనున్నారు. ఆయన పర్యటన తర్వాతైనా ఏజెన్సీలోని విద్యా సంస్థల పరిష్కారమవుతాయేమోనన్న ఆశతో గిరిజనులు చూస్తున్నారు. వీరి ఆశ ఏ మేరకు నెరవేరుతాయో వేచి చూడాల్సిందే.

ఏడాది నుంచి టీచర్ లేని పాఠశాల

కొమరాడ : మండలంలోని కుంతేసు పంచాయితీ గోనకల్లు పంచాయతీలోని గల ప్రాథమిక పాఠశాలకు సుమారు ఏడాది నుంచి టీచర్ లేక పాఠశాల మూతబడిపోయింది. ఏడాది నుంచి గిరిజన విద్యార్థులకు చదువు చెప్పే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారుగా 30 మంది విద్యార్థులు చదువుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నా కనీసం విద్యాశాఖ అధికారులు గానీ, పాలకులకుగానీ తమ గోడును పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పాఠశాల ఉన్నప్పటికీ ఏడాది నుంచి ఉపాధ్యాయులను నియమించకపోవడంతో తమ పిల్లల భవిష్యత్తు పూర్తిగా నాశనమైందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వీసిన గాలలకు పాఠశాలపై కప్పు రేకులు పూర్తిగా ఎగిరిపడ్డాయి. పాఠశాల నిర్వహణ కూడా లేకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. మా పాఠశాలకు కనీసం వారానికి ఒకసారైనా టీచర్‌ను పంపించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. మారుమూల గిరిజన గ్రామాలకు కనీసం రోడ్లు సదుపాయాలు లేకపోవడంతో పాఠశాలకు ఉపాధ్యాయులు వెళ్లేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కనీసం వచ్చే ఏడాది నుంచైనా తమ గ్రామానికి పాఠశాలకు ఉపాధ్యాయులను పంపించాలని గిరిజనులు కోరుతున్నారు.

జీతాలు తీసుకుంటున్నారు... పనిచేయాలని బాధ్యత లేదా

అధికారులపై విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ఆగ్రహం

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

ప్రభుత్వం నుంచి లక్షల్లో జీతాలు తీసుకుంటున్నారు... బాధ్యతగా పనిచేయాలని మీకు తెలియదా? అంటూ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ అధికారులపై మండిపడ్డారు. గురువారం రాత్రి కొండాపురం గ్రామాన్ని సందర్శించి అక్కడ పదో తరగతి చదువుతూ రక్తహీనత వ్యాధి ఉన్నట్టు వంటి పిల్లల ఇంటికి వెళ్లారు. వారికి అందుతున్న సౌకర్యాలు, విద్యాప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలు ఏ విధంగా బోధిస్తున్నారు, ఎలా అర్థమవుతున్నాయని విద్యార్థులను అడగ్గా వారు సక్రమంగా సమాధానం చెప్పలేకపోవడంతో ఆ పాఠశాల హెచ్‌ఎంతో పాటు ఎంఇఒ ఎం.సూర్యనారాయణపై మండిపడ్డారు. మీరేం పర్యవేక్షణ చేస్తున్నారని , మీకు బాధ్యత ఉందా అంటూ ఎంఇఒను ప్రశ్నించారు. ఇలా అయితే సహించేది లేదని, సస్పెన్షన్ చేస్తామని హెచ్చరించారు. డిఇఒ రమణ, ఆర్‌జెడి జ్యోతి కుమారి పనితీరుపై కూడా చీవాట్లు పెట్టారు. విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయని, వాటిని అధికారులు బాధ్యతగా అమలు చేయాల్సి ఉన్నప్పటికీ అలా లేదని అన్నారు. విద్యాశాఖలో ఇకముందు లోపా లుంటే ఊరుకునేది లేదని ఉద్యోగులను ఇంటికి పంపిస్తానని హుకుం జారీ చేశారు. విద్యావ్యవస్థకు క్యాన్సర్ వ్యాధి పట్టిందని, దీనికి వైద్యం చేయాల్సిన అవసరం ఉందని సుతిమెత్తగా మందలిం చారు. అనంతరం అంగన్వాడీల ద్వారా పిల్లలకు అందుతున్న పౌష్టికాహారాన్ని, వైద్యసిబ్బంది ద్వారా పిల్లలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వారు సక్రమంగా సమాధానం చెప్పకపోవడంతో అసహనం చెందారు. మీరంతా ఏం పని చేస్తున్నారని, ఎందుకు ఈ వ్యవస్థలు న్నాయని మండిపడ్డారు. అదే విధంగా వాలంటీర్ల ద్వారా ప్రజలకు సేవలు అందించాలని, దానిపై సచివాలయాలతో పాటు మండలస్థాయి యంత్రాంగం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. అటువంటి చర్యలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. రాత్రి 9.30గంటలకు పరిశీలన అనంతరం ఆయన వీరఘట్టం మండలం రేగులపాడు కస్తూరిబా పాఠశాలకు వెళ్లి తనిఖీ నిర్వహించారు. ఆ తర్వాత సీతంపేటలో బస చేస్తారు. ఆయన వెంట ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, తహశీల్దార్ సోమేశ్వరరావు, డిఎల్‌డిఒ వి.వి.గోపాలకృష్ణ, ఎంపిడిఒ డొంక త్రినాథులు తదితరులున్నారు.

విద్యార్థినితో మాట్లాడుతున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్

పింఛను 10 వేలకు పెంచాలి

విజయనగరం: ఇపిఎఫ్ పింఛను రూ.10 వేలకు పెంచాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శేషగిరి, ప్రధాన కార్యదర్శి నాగభూషణం కోరారు. గురువారం ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌కి వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం హైయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్ ఇచ్చుకొనే విషయంలోనూ కేంద్రప్రభుత్వం, ఇపిఎఫ్ఓ కార్యాలయం పెన్షనర్లు, కార్మికులతో చెలగాటం ఆడుతున్నాయ న్నారు. కార్యక్రమంలో పెన్షనర్లు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సౌకర్యాలను పిఒ విష్ణుచరణ్‌కు వివరిస్తున్న సూపరింటెండెంట్

జిల్లా ఆస్పత్రిలో పిఒ తనిఖీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్థానిక జిల్లా ఆసుపత్రిని ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ గురువారం తనిఖీ చేశారు. సాధారణ వార్డు, ఐసియు, ఆపరేషన్ థియేటర్, డ్రగ్స్ రూం, డే కేర్ సెంటర్, బర్త్ వెయిటింగ్ హాల్, ఎస్ఎన్‌సి.యు యూనిట్లను పరిశీలించారు. వైద్యులు, వైద్య పరీక్షలకు, వైద్య సేవలకు వచ్చిన వ్యక్తులతో మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడుతూ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే వారితో ప్రేమ, ఆప్యాయతలతో పలకరిస్తే వైద్యుల పట్ల నమ్మకం పెరిగి వారి బాధకు అక్కడే ఉపశమనం లభిస్తుందని అన్నారు. రక్తహీనత, బహిరంగ మలవిసర్జన వల్ల కలిగే అనర్థాలు, స్థానికంగా లభించే ఆకుకూరలు, పండ్లు, ఇతర ఆహార పదార్థాల విలువ తెలియజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.బి.వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

ఇఎంఐ చెల్లింపుల్లో వెసులుబాటు కల్పించండి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

తమ న్యాయమైన కోర్కెల సాధనకు గత కొద్దిరోజులుగా అమరావతి ఉద్యోగుల జెఎసి చేస్తున్న మలి దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.శ్రీరామ్మూర్తి, డి.ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు, పలుశాఖలకు చెందిన ఉద్యోగులు గురువారం స్థానిక మేనేజర్‌ను కలిసి ఇఎంఐల చెల్లింపుల్లో ఉద్యోగులకు, ఫించన్‌దారులకు వెలుసుబాటు కల్పించాలనికోరారు. ప్రభుత్వం జీతాలు సక్రమంగా ఇవ్వని కారణంగా సకాలంలో ఇఎంఐలను చెల్లించలేక పోతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ చైర్మన్ మరిపి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ ఆర్.రమణమూర్తి, కోశాధికారి టివి రమణ, రిటైర్డ్ ఉప తహశీల్దార్ జి.అప్పలరాజు, కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మోడీతో దేశానికి ముప్పు

ప్రచారభేరిలో వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

దేశంలో ప్రభుత్వరంగ సమస్థలన్నీ కార్పొరేటర్లకు అప్పనగా కట్టబెడుతున్న ప్రధాని నరేంద్రమోడీ విధానాల వల్ల దేశానికి ముప్పు ఏర్పడుతుందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలపై ప్రచారభేరీలో భాగంగా గురువారం పాలకొండ మండలం మల్లమ్మగూడ, సింగన్న వలస గ్రామాల్లో గురువారం సిపిఎం నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ దావాల రమణారావు మాట్లాడుతూ బిజెపి నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల హక్కులు కాలరాస్తున్నారనీ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేటు వారికి అమ్మివేసి రిజర్వేషన్లు లేకుండా చేస్తున్నారని అన్నారు. మొత్తం వ్యవసాయం, భూములను అదానీ, అంబానీలకు అప్పజెప్పి, ఆహార భద్రత లేకుండా చేస్తున్నారని అన్నారు. 1/70 చట్టాన్ని ఎత్తివేసి గిరిజనుల భూములు కార్పొరేట్లకు అప్పజెప్పడానికి చూస్తున్నారని, జిఓ నంబర్ 3 ఎత్తివేశారని, గిరిజన యువతకు ఉపాధి లేకుండా చేస్తుందన్నారు. బిజెపి దేశానికి, రాష్ట్రానికి ద్రోహం చేస్తుంటే టిడిపి, వైసిపి, జనసేన నోరుమెదడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేఖంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దూసి దుర్గారావు, కాద రాము, మల్లమ్మ గూడ శాఖ నాయకులు ఒరియా, మజ్జయ్య, గబ్రిల్, భాను, సుందర్, ఎస్. చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : కేంద్ర ప్రభుత్వం, బిజెపి విధానాలపై ప్రచారంలో మండలంలోని రావాడ రామభద్రపురంలో సిపిఎం నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేటర్ల వేల కోట్ల రూపాయలు ప్రధాని మోడీ మాఫీ చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొల్లి గంగునాయుడు, బి.మోహనరావు, గొరపాడు సోమయ్య పాల్గొన్నారు.

పార్వతీపురం పట్టణంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

పార్వతీపురం టౌన్ : వామపక్షాల ప్రచారభేరిలో భాగంగా పట్టణంలోని 21వ వార్డులో గల ఎస్ఎన్‌పి కాలనీలో రాజకీయ ప్రచారభేరి చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిరా, నాయకులు జి.వెంకటరమణ మాట్లాడు తూ దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగ విలువల పరిరక్షణకి పోరాడాలని, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు, రోడ్లు, విమానాలు, ఓడరేవులు, విశాఖ స్టీల్ ప్లాంట్ తదితర సంస్థలను ప్రేవేటుపరం చేస్తూ మోడీ ప్రభుత్వం రాష్ట్రనికి ద్రోహం చేస్తుందని విమర్శించారు. వీటిపై వైసిపి, టిడిపి, జనసేన ప్రశ్నించకుండా బిజెపికి ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బిజెపితో పాటు చట్ట సభలో మద్దతు తెలుపుతున్న రాష్ట్ర పార్టీలను కూడా వ్యతిరేకించాలని కోరారు. ఈనెల 27న పార్వతీపురంలో జరిగే బహిరంగసభలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి, పి.రాజశేఖర్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : సిపిఎం- సిపిఐ ప్రచార భేరిలో భాగంగా మండలంలోని అడ్డాపుశిల పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధీ కూలీలతో సమావేశం నిర్వహించి, కరపత్రాలు పోస్టర్ లు ప్రచారం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బంటు దాసు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈదుబిల్లి వెంకటనాయుడు, కమిటీ సభ్యులు బొబ్బాది తవిటినాయుడు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలు పెంపు పక్షాలపై దాడి చేస్తున్న మాట్లాడని, బిజెపికి సహకరిస్తున్న శక్తులను రాబోయే ఎన్నికలలో ఓడించాలని పిలుపునిచ్చారు.

కురుపాం : నరేంద్ర మోడీని గద్దెదించుదాం దేశాన్ని కాపాడుకుందాం నినాదంతో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన దేశ రక్షణ ప్రచారభేరి యాత్ర కురుపాం సంతలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ పార్టీ నాయకులు కొల్లి గంగు నాయుడు, ఎం.శ్రీనివాసరావు, జి. సూరయ్య గిరిజనులు వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం సిపిఐ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా మార్టులను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

మహిళల ఆర్థిక స్వావలంబన సాధించడానికి 25ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన మహిళా సంఘాల సభ్యులంతా వ్యాపార వేత్తలుగా కావాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారంనాడు స్థానిక మండల వెలుగు కార్యాలయంలో జరిగిన మండల గ్రామైక్యసంఘాల సమీక్షసమావేశంలో ఆయన మాట్లాడారు. జీవనోపాధి స్థాయిని పెంచడానికి, మహిళలో పేదరికాన్ని నియంత్రణ చేయడానికి ఏర్పాటు చేసిన సంఘాల సభ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా మండల, గ్రామైక్య సంఘాల నాయకులు ఆలోచన చేయాలనీ సూచించారు. సాధించడానికి మహిళా సంఘాల నాయకులు ఆలోచన చేయాలనీ సూచించారు. కొత్తగా ప్రతి మండల కేంద్రంలో మహిళలంతా కలిసికట్టుగా తక్కువ ఖర్చుతో అధిక రాబడి తెచ్చిపెట్టే మహిళామార్టుల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని కోరారు. పెద్ద పెద్ద సంస్థలు వ్యాపారంద్వారా సాధించిన విజయాలను వివరించి, మహిళా సంఘాల సభ్యులంతా కూడా ఆదిశగా ఆలోచన చేయాలనీ సూచించారు. మహిళల్లో ఆలోచన సరళిని మార్చేందుకు కృషి చేయాలని కోరారు. మండలంలోని 41గ్రామైక్యసంఘాల పరిధిలోని 1720 వెలుగు సంఘాల్లో దాదాపు 18వేలమంది సభ్యులు ఉన్నారని ఎపిఎం రెడ్డి శ్రీరాములు తెలిపారు.మండలంలో వెలుగు ద్వారా చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఎజిఎం హేమలత, ఐబి, చేయూత,హెచ్ డి సహాయ ప్రోగ్రాం అధికారులు జయమ్మ, సతీష్, త్రినాధమ్మ, స్త్రీనిధి జిల్లా మేనేజర్ చంద్ర మహేశ్, సహకార బ్యాంకు మేనేజర్, ఉద్యోగులు, వెలుగు సిసిలు కోటేశ్వర రావు,అప్పారావు,ఆనందరావు, మోహనరావు,మండలంలోని 40 గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, వెలుగు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంగా వైఎస్‌వలస విద్యార్థులు

ప్రజాశక్తి - పార్వతీపురం

మక్కువ మండలం వైఎస్‌వలస పాఠశాల విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నారని ఇన్ ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్‌వలస కు చెందిన 9 మంది విద్యార్థులకు బుధవారం రేపిడ్ ఎంటిజెన్ టెస్ట్ (ఆర్ఎటి)లో నిర్వహించగా పాజిటివ్ వచ్చిన విషయం తెలిసిందేనాన్నరు గురువారం పాఠశాలలో 131 మంది విద్యార్థులకు కోవిడ్ పరీక్షలు నిర్వహించగా 122 మందికి నెగిటివ్ వచ్చిందని చెప్పారు. పాజిటివ్ కనిపించిన విద్యార్థులకు మాస్కులు, శానిటైజర్లు, మందుల కిట్లు అందించి ప్రత్యేకంగా (ఐసోలేషన్)లో పెట్టి ఆరోగ్య పరిస్థితి గమనిస్తున్నామన్నారు.

ఒకపూటే ఉపాధి పనులు పెట్టాలి

ఎంపిడిఒ కార్యాలయం వద్ద వేతనదారుల ధర్నా

ప్రజాశక్తి - బలిజిపేట

ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉపాధి పనులు ఒక్క పూట పెట్టాలని, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు, టెంట్లు, మజ్జిగ, తాగునీరు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో వేతనదారులు గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు యమ్మల మన్మధ రావు మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని, రెండు పూటలు పని పెట్టడం వల్ల వేతనదారులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండల తీవ్రత తట్టుకోలేక పనులు చేయలేకపోతున్నారన్నారు. ఉపాధి చట్టానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని, కొత్తగా ఎస్ఎంఎంఎస్ యాప్ తీసుకొచ్చి రెండు పూటలా ఫోటోలు తీయాలన్న నిబంధనతో ఉపాధి కూలీలు తీవ్ర అవస్థలుపడుతున్నారని అన్నారు. గతంలో పని ప్రదేశంలో టెంట్లు, మజ్జిగ, మంచినీరు, ప్రథమ చికిత్స బాక్సులు ఉండేవని, ఇప్పుడు అవేమీ లేవన్నారు. కావున ఒక్క పూట పని, పని ప్రదేశాలు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 200 రోజులు పని, ఉపాధి కూలీ రూ.600 ఇవ్వాలని ఎంపిడిఒ భానుమూర్తికి వినతిని అందజేశారు. కార్యక్రమంలో వేతనదారులు అసురయ్య, రాము, లక్షణ, సీతమ్మ, సిపిఎం నాయకులు బద్దాన భానుమూర్తి, వెన్నెల వేణు, మజ్జి దుర్గారావు, నల్ల ఈశ్వరరావు, వెన్నెల కృష్ణమూర్తి, పిసా వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేటలో ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న ఉపాధిహామీ కూలీలు, సిపిఎం నాయకులు

కొమరాడ : ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు రక్షణ ఏది అని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి అధికారులను ప్రశ్నించారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ మండుటెండల్లో రెండు పూటలా పని చేయించడం కూలీల జీవితాలతో ఆటలాడమేనన్నారు. ఏడాదికి 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ.600 కూలి ఇచ్చి, ఒక్క పూట పని కల్పించి, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించి జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రతిరోజు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈరోజు ఉపాధి కూలీలకు గానూ మండుటెండల్లో రెండు పూటలా పని కల్పించడంతో వడదెబ్బకు గురై అనేకమంది ఇప్పటికే రోగాలు పాలై ఆస్పత్రుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉందని అన్నారు. అలాగే పని చేసే చోట మంచినీరు, నీడ కల్పించేలా టెంట్లు వేయాలన్నారు. ఒక్క పూటే పని కల్పించి ఉపాధి కూలీలను అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కనీస వేతనం అందాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధి హామీ పనులకు వచ్చే వేతనదారులకు కనీస వేతనం అందాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ అన్నారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో ఉపాధి హామీ ఎపిడిలు, ఇతర సిబ్బందితో గురువారం పిఒ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో పాల్గొంటున్న వేతనదారుల వివరాల నివేదిక సమర్పించాలన్నారు. కనీస వేతనం ప్రతి ఒక్కరికీ అందాలని, దాన్ని సాధించేందుకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. పనులు జరిగిన వెంటనే బిల్లులు అప్ లోడ్ చేయాలని, తద్వారా సకాలంలో వేతనాల చెల్లింపునకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఆధార్ అనుసంధానం జరగాలని ఆయన అన్నారు.

వేసవి తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి

వేసవి తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉపాధి హామీ సిబ్బందిని ప్రాజెక్టు అధికారి ఆదేశించారు. నిర్దేశిత సమయంలో మాత్రమే పనులు చేయాలని అందుకు వేతనదారులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున పనిచేసే చోట నీడ, తాగు నీరు లభ్యత ఉండాలని ఆయన తెలిపారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వడదెబ్బ తగలకుండా అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆయన ఆదేశించారు.సమావేశంలో ఎపిడి పి.శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని ఆదరించండి : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - మక్కువ

గడపగడపకు సం క్షేమ పథకాలను అందించే వైసిపిని ఎన్నికల్లో ఆదరించాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి డిప్యూటీ సిఎం పీడిక రాజన్న దొర ప్రజలను కోరారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధిలోని మేలాపువలసలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమవుతూ గత టిడిపి ప్రభుత్వానికి ఇప్పటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి తేడా తెలుసుకోవాల న్నారు. మరల ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో అఖండ విజయంతో అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారథులతో కలిసి డోర్ స్టిక్కర్స్, మొబైల్ స్టిక్కర్స్ అంటించడం మిస్డ్ కాల్స్ ఇవ్వడం వారి అభిప్రాయాలను తీసుకున్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, మండల వైసిపి అధ్యక్షులు రంగునాయుడు, నాయకులు, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు

స్టిక్కర్‌ను అతికిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సిబ్బంది లక్ష్యాలను చేరుకోవాలి

జిసిసి డిఎం మహేంద్రకుమార్

ప్రజాశక్తి - సాలూరు

జిసిసి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్ కోరారు. గురువారం స్థానిక జిసిసి బ్రాంచి కార్యాలయంలో సేల్స్‌మేన్లు, డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది లక్ష్యాలను సాధించడానికి ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. పని చేసే చోట సిబ్బంది నివాసం వుండాలని ఆదేశించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో నిత్యావసర వస్తువుల పంపిణీ విషయంలో అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులొస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో బ్రాంచి మేనేజర్ జె.రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సరుకులను పరిశీలిస్తున్న పిఒ కల్పనాకుమారి

డిఆర్ డిపో సందర్శన

సీతంపేట: మండలంలోని పొల్ల పంచాయతీలోని నాయకమ్మగూడలో గల జిసిసి డిపోను ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిపోలోని సరుకులను పరిశీలించారు. కందిపప్పు నిల్వలు ఎక్కువగా ఉండడంతో అమ్మకాలు జరపట్లేదా అని ప్రశ్నించారు. అలాగే స్టాక్ రికార్డులు సక్రమంగా లేకపోవడం చూసి డీలరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ సరుకుల జాబితా, ధరల పట్టిక ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో డీలర్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజేతకు ట్రోఫీని అందజేస్తున్న నవీన్ తల్లి భారతి

నవీన్ మెమోరియల్ టోర్నమెంట్ విజేత ఘనసర

భామిని : మండలంలోని సోలికిరిలో కొత్తకోట నవీన్ జ్ఞాపకార్థం గత 27 రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ విన్నర్‌గా ఘనసర జట్టు సోలికిరి జట్టుపై ఘన విజయం సాధించింది. గురువారం ఘనసరా, సోలికిరి జట్ల మధ్య జరిగిన ఆఖరి మ్యాచ్‌తో టోర్నమెంట్ ముగింది. విజేతగా నిలిచిన ఘనసర క్రికెట్ జట్టు కెప్టెన్‌కు విన్నర్ ట్రోఫీతో పాటు నగదు బహుమతిని నవీన్ తల్లి కొత్తకోట భారతి అందజేశారు. రన్నర్ ట్రోఫీని బాలేరు ఎంపిటిసి సభ్యులు కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ అందజేశారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కొత్తకోట ఆంజనేయులు, పిఎసిఎస్ ఛైర్మన్ గెల్లంకి రమేష్, మెడిబోయిన చలపతిరావు, కాగితపల్లి కృష్ణ, శ్రీను ఉన్నారు.

231 మందిపై కేసులు

పాలకొండ : జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఉత్తర్వుల మేరకు పార్వతీపురం జిల్లాలో జరుగుతున్న వంటి ప్రత్యేక డ్రైవ్‌లో గత ఆరు రోజులుగా పాలకొండ సబ్‌డివిజన్ పరిధిలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని, తాగి వాహనాలు నడుపుతున్న వారిని అదుపు చేయడానికి చేస్తున్నటు వంటి ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 231 ఓపెన్ డ్రింకింగ్ కేసులు, 12 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్టు డిఎస్‌పి కృష్ణారావు విలేకరులకు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, వాహనాలు నడిపే వారిపైనా, మైనర్ డ్రైవింగ్ చేసిన వారిపై, రికార్డులు సరిగ్గా లేకుండా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

సీతానగరం : వేసవి నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపిడిఒ ప్రసాదరావు, ఇఒపిఆర్‌డి కెకె వర్మ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని, వర్షాకాలం రాకముందే పూర్తిస్థాయిలో కాలువలను శుభ్రం చేయించి పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, జగనన్న స్వచ్ఛ సంకల్పంలో ఆన్‌లైన్ యాప్ నిర్వహణ సక్రమంగా ప్రతిరోజూ చేయాలని, క్లాప్ మిత్రాల జీతాలు బకాయిలు చెల్లించేలా చూడాలని, ఇంటి పన్నులను వసూలు చేయాలని, గ్రామకంఠంలోని ఇళ్లు, ఖాళీ స్థలాల సర్వే జాగురూకతతో చేయాలని సూచించారు.

నేడు వాహనాల వేలం

పాలకొండ: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ వద్ద శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్‌ఇబి ఎంవి గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో రెండు ఆటోలు, 1 తవేరా కారు, ఒక పల్సర్ బైక్‌ను బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్సై శివప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చునన్నారు.

బీమా సహాయం అందజేత

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ మహేంద్రపురానికి చెందిన బిడ్డిక గోపాలరావు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆకస్మికంగా మృతి చెందారు. సంఘటన తెలుసుకున్న సర్పంచ్ ఎ.మన్మథరావు, ఎఎంసి ఛైర్మన్ ఎన్.వెంకటరావు గురువారం ఆయన ఇంటి వద్దకు వెళ్లి నామినీ అయిన మృతుని భార్య భారతికి వైయస్సార్ భీమా పథకం ద్వారా రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆటో వర్కర్స్ యూనియన్

సిఐటియు ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ

సాలూరురూరల్ : వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు సిఐటియు ఆధ్వర్యాన మండలంలోని మామిడిపల్లిలో గురువారం మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. మామిడిపల్లిలోని ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నాయకులు పాదచారులు, ప్రయాణికులకు తమ వంతు సహాయంగా స్థానిక మూడు రోడ్ల కూడలి వద్ద గల యూనియన్ ఆఫీస్ వద్ద ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు జర్జాపు జ్యోతిస్వరూప్ అప్పలరాజు, మహేష్, భాస్కరరావు, శ్రీను పాల్గొన్నారు.

ఆర్‌ఎన్ వలసలో జగనన్న నువ్వే మానమ్మకం

జియ్యమ్మవలస : మండలంలోని పెదమేరంగి పంచాయతీ రామినాయుడు వలస లో జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమం గురువారం వైస్ ఎంపిపి గుడివాడ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయిపల్లి అనూరాధ, తట్టికోట రాంబాబు, వేవ కోట తిరుపతిరావు, పోల వెంకటరత్నం, మరడాన మధుసూదన రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇఫ్తార్ విందు

కలెక్టరేట్ : ఇఫ్తార్ విందును శుక్ర వారం ఏర్పాటు చేసినట్టు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎం. లావణ్య తెలిపారు. ఈ మేరకు గురు వారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక వెంకటేశ్వర కల్యాణ మండపంలో సాయంత్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొంటారని ఆమె వివరించారు.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు 73వ జన్మదిన వేడుకలు చినమేరంగిలో మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు, కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యాన గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత బాణాసంచా కాల్చి కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా నినాదాలు చేశారు. అనంతరం ఐదు మండలాల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని చెప్పారు. అందుకోసం ప్రతి కార్యకర్త అధినేత జన్మదినమైన నేటి నుండే ప్రతినపూని టిడిపి బలోపేతానికి కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఐదు మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు కురుపాంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దత్తి లక్ష్మణరావు, టిడిపి ఆశావాసులైన పువ్వల లావణ్య, బిడ్డికి పద్మావతి, బిడ్డిక తమ్మయ్య, ఆర్‌ఎస్‌ఎస్ విజయ్ కుమార్, భూపతి దొర ఆధ్వర్యంలో రావాడ జంక్షన్ సమీపంలో నిర్వహించారు. స్థానిక బస్టాండ్ నుంచి సమావేశ జరిగే సభ వరకు టిడిపి నాయకులు, కార్యకర్తలతో భారీగా ర్యాలీగా వచ్చి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, చందక రామకష్ణ, సువ్వాన గోవింద నాయుడు, మాజీ ఎంపీపీ జివి రమణమూర్తి, లక్షణరావు, సువ్వాన వెంకటరమణ, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భామిని : టిడిపి పంచాయతీ కమిటీ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కమిటీ సభ్యులు బిడ్డిక ప్రసాద్ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భామిని పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భామిని సర్పంచ్ లోపింటి రాజేష్, నాయకులు కొరడ రాజేష్, గురిబిల్లి లక్ష్మీపార్వతి, కొల్ల మధు, సత్యనారాయణ, వానపిల్లి రవి, లోపింటి చరణ్, గురిబిల్లి ప్రసాద్, సునీల్ శాంత్రో, కొల్ల చిన్నారావు జల్లేడు రవి ఉన్నారు.

కురుపాం : కేక్ కట్ చేస్తున్న దత్తి లక్ష్మణరావు

పార్వతీపురంరూరల్ : చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని బైపాస్ రోడ్‌లోని షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డి.శ్రీదేవి, ఎఎంసి మాజీ ఛైర్మన్ రెడ్డి శ్రీనివాస రావు, నాయకులు జి.వెంకటనాయుడు, ఉదయభాను, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు జి.రవికుమార్, దొగ్గ మోహనరావు, కౌన్సిలర్లు టి.వెంకటరావు, బి.గౌరినాయుడు, కోల సరితామధు, బోను చంద్రమౌళి, జి.రామ్మూర్తి జాగాన రవికుమార్, బేత లక్ష్మణరావు, బుడితి శ్రీరాం, పాలకొండ రాజశేఖర్, సిరిపురపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక టిడిపి కార్యాలయంలో చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు మండలం పార్టీ అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు వివిధ గ్రామాల నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం టిడిపి సీనియర్ నాయకులు వాడాడ రాము మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుండి ప్రతి ఒక్కరూ సమన్వయం తో పనిచేయాలని కోరారు.కార్యక్రమంలో బిసి సెల్ ఉపాధ్యక్షులు పెంకి రామ్మోహన్‌రావు, అరకు పార్లమెంటరీ నియోజకవర్గం కార్యదర్శి మజ్జి అప్పారావు క్లస్టర్ ఇంచార్జిలు గుల్ల బాబ్జీ, రాంబాబు విశ్వేశ్వరరావు, నాయకులు సింహాచలం ం, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : రోగులకు పండ్లు అందజేస్తున్న జగదీశ్వరి

పార్వతీపురంలో పూజలు చేస్తున్న టిడిపి నాయకులు

బట్టలు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం : చంద్రబాబునాయుడు జన్మదిన సందర్భంగా మండలంలోని సవరకోటపాడులో గిరిజనులకు టిడిపి కురుపాం ఇంచార్జి తోయక జగదీశ్వరి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, నాయకులు అడ్డాకుల నరేష్ తదితరులు ఉన్నారు.

సాలూరురూరల్ : మండలంలోని మామిడిపల్లిలో చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులు బూసా తవుడు, అరకు పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి డొంక అన్నపూర్ణ, మాజీ ఎంపీపీ డొంక పద్మావతి, సీనియర్‌కార్యకర్త పటేల్ నేలయ్య, వెంకటరమణ, తిరుపతిరావు, సుధాకర్, నాగరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలు టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక హనుమాన్ కూడలి వద్ద ఉన్న షిర్డీసాయి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక కొమ్మినేని ఇంటివద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో దామినేని భానుప్రసాద్, సాల హరిగోపాల్, రౌతు వేణుగోపాల నాయుడు, బుడితి శ్రీనివాసరావు, పెద భోగిలి, రామవరం, తామరఖండి, చెల్లం నాయుడువలస సర్పంచులు జొన్నాడ తేరేజమ్మ, పెంట సత్యంనాయుడు, మూడడ్ల వెంకట నాయుడు, వాకాడ పారినాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బలిజిపేట : సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలనాయుడు

చంద్రబాబు జన్మదిన వేడుకల్లోనూ గ్రూపులు

- మండల అధ్యక్షుడిని నేనంటే నేనే
- పిన్నింటి,ముఖి ఆధ్వర్యాన వేర్వేరుగా వేడుకలు

ప్రజాశక్తి - సాలూరు/పాచిపెంట

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా మండలంలో టిడిపి నాయకుల మధ్య గ్రూపు రాజకీయాలు మరోసారి స్పష్టంగా బయటపడ్డాయి. అధ్యక్షుడి పుట్టినరోజు వేడుకలను కూడా కలిసి చేయలేని స్థితిలో మండల టిడిపి నాయకులు వున్నారు. మండల టిడిపి కొత్త అధ్యక్షుడు ముఖీ సూర్యనారాయణ ఆధ్వర్యాన ఆయన సొంత గ్రామం మాతుమూరులో చంద్రబాబు జన్మదినం సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేశారు. కొద్ది రోజుల క్రితం ఇదే గ్రామంలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి మాట్లాడుతూ మండల పార్టీ అధ్యక్షుడు ముఖీ సూర్యనారాయణేనని, ఆయన ఆధ్వర్యానే పార్టీ కార్యక్రమాలు జరుగుతాయని ఆమె ఖరాఖండీగా స్పష్టం చేశారు.

మాజీ ఎంపిపి పిన్నింటి ప్రసాద్ బాబు ఆధ్వర్యాన పాచిపెంటలో చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ ముఖ్య అతిథిగా దీనికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్ బాబేనని స్పష్టం చేశారు. పిన్నింటిని మండల అధ్యక్షుడిగా తొలగించినట్లు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. పిన్నింటి సారథ్యంలోనే పార్టీ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. కొత్త అధ్యక్షుడిగా ముఖీ సూర్యనారాయణను నియమిస్తూ నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి రాష్ట్ర నాయకత్వానికి పంపించిన నివేదికను పార్టీ రాష్ట్ర నాయకత్వం పక్కన పెట్టిందని భంజ్ దేవ్ తెలిపారు.

సంధ్యారాణి ఆధ్వర్యాన వేడుకలు

చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి ఆధ్వర్యాన ఆయన పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో బర్త్ డే కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు.అంతకు ముందు పట్టణంలోని ఆలయంలో ఆమె మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు,పట్టణ,మండలం నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు సందర్భంగా అగ్నిమాపకశాఖ ఆ కేంద్రంలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక అధికారి కె.సురేంద్రబాబు మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది, కావున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అగ్నిప్రమాదలను సమర్ధవంతంగా ఎదుర్కొనాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలని, వంటగ్యాస్ ఉపయోగించే ముందుగా గాలి, వెలుతురు ఉండేలా చూసుకోవాలని, గ్యాస్ వినియోగించే ముందుగా 5నిమిషాలు తలుపులు కిటికీలు తెరిసి ఉంచాలని, తద్వారా అగ్నిప్రమాదల నుంచి తప్పించుకోవచ్చునని తెలిపారు. గ్యాస్ బండ ఉండే చోట ప్రమాదకరమైన వస్తువులు లేకుండా చూసుకోవాలన్నారు. వంట పని పూర్తవ్వగానే గ్యాస్ రెగ్యులేటర్ ఆఫ్ చేయాలని, తద్వారా అగ్నిప్రమాదలను నివారించవచ్చునని అన్నారు. ముఖ్యంగా అగ్నిమాపక అధికారి వారి ఫోన్ నెంబర్ ప్రతి ఒక్కరి వద్ద ఉండాలని సూచించారు విద్యుత్తు వినియోగించే ముందు తగుజాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, రిటైర్మెంట్ ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: అగ్నిమాపక శాఖ వారోత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక పరికరాలు, వస్తు ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ వస్తు ప్రదర్శనను పాలకొండలో చదువుతున్న పలువురు విద్యార్థులు తిలకించారు. అలాగే ఏ పరికరం ఎలా ఉపయోగపడుతుందనే విషయాన్ని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు వివరించారు. అలాగే ప్రజలు ఎటువంటి ప్రమాదంలో ఉన్నా కేంద్రానికి తెలిపితే వారి ప్రాణ, ఆస్తిలకు రక్షణ కల్పించేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీలో గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెదరామ పంచాయతీ పరిధిలోని మొగధారగూడ, మధ్యమొగధారగూడ, మొగధార, మొగధారకాలనీ, సంకిలిగూడ, కోపువలస, పెదరామ గ్రామాల్లో గురువారం పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి ఆధ్వర్యాన గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు. మొగధార జంక్షన్ నుండి మొగధారగూడకు రూ.10లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు, ఒంటరి మహిళ సవర లక్కమ్మకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. మొగధారలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన మరమ్మతుల కోసం ప్రభుత్వం ద్వారా నాడు-నేడు మూడో విడతలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కోపువలస జంక్షన్ నుంచి ఈతమానగూడ వరకు గల సుమారు రెండు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయమని అధికారులకు సూచించారు. అలాగే కమ్యూనిటీ భవనాలు, ఇంటర్నల్ సిసి రోడ్లు, వరద గోడలు, కరెంటు స్తంభాలు, రచ్చబండలు నిర్మాణాలకు గడపగడపకు మన ప్రభుత్వ నిధుల ద్వారా పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ఆదినారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు లక్ష్మి, సర్పంచ్ తిరుపతిరావు, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, జిల్లా కోఆప్షన్ సభ్యులు లక్ష్మి, వైస్ ఎంపిపిలు ఎం.విజయలక్ష్మి, కె.సరస్వతి, ఎంపిడిఒ కొండపల్లి సత్యం, ఎంపీటీసీ చంద్రశేఖర్, రాము కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



బిపి మిషన్‌ను అందజేస్తున్న తిరుపతిరావు

పార్టీ పనులకు వాలంటీర్లా?

బిపి మిషన్ వితరణ

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర ప్రభుత్వంచే గౌరవ వేతనం పొందుతున్న వాలంటీర్లు జగనన్నే మా భవిష్యత్ అనే వైసిపి పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొనడం అనైతికమని టిడిపి మండల మాజీ అధ్యక్షులు పెంట తిరుపతిరావు అన్నారు. గురువారం టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని ఎ.వెంకమపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ వాలంటీర్లు వైసిపికి కార్యకర్తల్లా పనిచేస్తున్నారని, వారు చట్టబద్ధంగా విధులను ఉల్లంఘించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. తక్షణమే ఇటువంటి చర్యలను నియంత్రించి , వారిపై చర్యలను తీసుకోవాలని ఎంపిడిఒను డిమాండ్ చేశారు. చంద్రబాబు పుట్టినరోజును పురస్కరించుకొని స్థానిక ఆరోగ్య ఉప కేంద్రానికి బిపి ఆపరేటర్ మిషన్‌ను అందజేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం జెమ్స్ హాస్పిటల్ వారి సౌజన్యంతో గురువారం గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో ఆరుగురు వైద్య నిపుణులు వైద్య సేవలందించగా వివిధ రకాల వ్యాధులతో 224 మంది చికిత్సలు పొందారు. అలాగే 64 మందిని రిఫెరల్ కేసులుగా గుర్తించి జెమ్స్ హాస్పటల్లో మెరుగైన వైద్యం అందించేందుకు నిర్ణయించారు. వీరిని శుక్రవారం ఉదయం ప్రత్యేక వాహనంలో శ్రీకాకుళం తీసుకెళ్లి మరింత వైద్యాన్ని అందించి వారిని తిరిగి గుమ్మలక్ష్మీపురానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకున్నారు. శిబిరంలో గుమ్మలక్ష్మీపురంతో పాటు లక్కగూడ, కొండవాడ, ఎల్విన్‌పేట, తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. వైద్య శిబిరంలో గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ సాయి తేజ, జనరల్ మెడిసిన్ డాక్టర్ సమీర్ చంద్ర, ఇఎన్‌టి డాక్టర్ బిందు భార్గవి, ఆర్థోపెడిక్ కౌశిక్, గైనిక్ డాక్టర్ పల్లవి, ఆప్తామాలజీ అప్పలకొండ తదితర వైద్య నిపుణులు పాల్గొన్నారు. జెమ్స్ హాస్పటల్ నుండి అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్వరరావు, ఏరియా మేనేజర్ రమేష్ పిఆర్‌ఓ త్రినాథ్ మరో పిఆర్‌ఓ రాజు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. తొలుత ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్రావు ప్రారంభించగా బిసి కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైస్ ఎంపిపి శేఖర్ ఇసిజి కేంద్రాన్ని, వైస్ సర్పంచ్ కిషోర్ ఏకో కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే మాజీ సర్పంచ్ ప్రేమానంద్‌కు మొదటి పరీక్షలు నిర్వహించగా, రోగులకు మందులను సర్పంచ్ గౌరీశంకరరావు, వైసిపి శేఖర్ పంపిణీ చేశారు. అలాగే శిబిరంలో పాల్గొన్న రోగులకు, వారి సహాయకులకు వైశ్య సంఘం ఉచిత భోజన ఏర్పాట్లు చేసింది. వైశ్య సంఘం ఒక సేవా కార్యక్రమంగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం ప్రజలకు ఎంతో ఉపయోగమని వారు పేర్కొన్నారు.

వైద్య శిబిరాన్ని సందర్శించిన పలువురు అధికారులు

మెగా వైద్య శిబిరంలో ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ, ఎస్‌ఐ షణ్ముఖరావు, సిబ్బంది సందర్శించి చికిత్సలు, పరీక్షలు పొందడం గమనార్హం. అలాగే స్థానిక ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.ప్రభాకర్ రావు, అలాగే అమెరికా నుంచి వచ్చిన వారి వైద్య మిత్రులు కూడా వైద్య శిబిరాన్ని సందర్శించి మారుమూల ప్రాంతంలో ఇటువంటి వైద్య శిబిరం నిర్వహించడం గొప్ప విషయమని అభినందించారు. అలాగే శిబిరాన్ని సందర్శించిన అధికారులు, ప్రజలు వైద్య శిబిరం సమర్ధవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. శిబిరంలో వైశ్య సంఘ సభ్యులతో పాటు ఉపాధ్యాయులు, దోస్త్ మేరా దోస్త్ సభ్యులు పాల్గొని తమ సహకారాన్ని అందించారు.



శిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న సిఐ

గులిచోడి సాగు విధానం అద్భుతం

పాచిపెంట : చోడి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే గులి చోడి సాగు విధానం ఒక అద్భుతమని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కేసలిలో రైతు మీసాల మోహనరావు ప్రకృతి సేద్య పద్ధతుల్లో సాగు చేస్తున్న గులి చోడి పద్ధతిని పరిశీలించారు. ఈ సందర్భంగా గులిచోడి పద్ధతి గురించి గ్రామ రైతు సత్తార్పు రాము మాట్లాడుతూ గ్రామ రైతులంతా ముందుగా ఈ పద్ధతిని చూసి అవహేళన చేశారని కానీ ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్న పంటను చూసి తమందరం ఇదే పద్ధతిని అనుసరిస్తామని అంటున్నామని తెలిపారు. సాంప్రదాయ చోడి పంట సాగు విధానం కంటే ఈ పద్ధతి ద్వారా రెట్టింపు దిగుబడులు వచ్చే అవకాశం కనిపిస్తుందని అన్నారు.కార్యక్రమంలో విఎఎ రాకేష్ కుమార్ పాల్గొన్నారు.

చెరువులో స్నానానికి దిగి యువకుడు మృతి

పార్వతీపురం రూరల్ : మండలంలోని ఎంఆర్ నగరంలో గురువారం మధ్యాహ్నం చెరువులో స్నానానికి దిగి యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాలు ప్రకారం గురువారం గ్రామానికి చెందిన మహంతి తిరుపతి ఇంట్లో జరుగుతున్న ఇంటిపండగకు తన మిత్రులతో హాజరైన ఒడిస్సా రాయగడ జిల్లా గడిశేషకలకు చెందిన మరిశర్ల సాయి భరత్ భోజనాలు అనంతరం మిత్రులతో కలిసి చెరువులోకి స్నానానికి దిగాడు. లోతు అంచనా వేయకపోవడంతో బురదలో కూరుకుపోయాడు. స్పందించిన మిత్రులు వెంటనే బయటకు తీసి పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భరత్ విశాఖపట్నం అవంతీ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు మిత్రులు తెలిపారు.

మృతి చెందిన సాయిభరత్

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కొమరాడ : గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపిడిఒ ఎల్‌బి అప్పారావు అన్నారు. గురువారం నాగావళి నది అవతల వైపు ఉన్న కెమిశిల, గునటిలేసు, దలైపేట సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించి కూలీలకు పలు సూచనలు సలహాలు అందజేశారు. సచివాలయంలో వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో నిత్యం ఉండాలన్నారు. ఉద్యోగులు విధులకు పట్ల నిర్లక్ష్యం వేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు స్పందన గ్రీవెన్స్‌లో తెలియజేసిన ప్రతి సమస్యకు పరిష్కరించేలా సచివాలయ ఉద్యోగులంతా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు.

ఘనంగా చందన, కల్యాణోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో గురువారం గంధం అమావాస్యను పురస్కరించుకొని శ్రీ లక్ష్మీ నృసింహస్వామికి చందన, కల్యాణోత్సవ మహోత్సవాలు రిత్విజుల వేదమంత్రోత్సవాల మధ్య ఉదయం 5 గంటల నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ, మొదటిరోజు గణపతి పూజ, అంకురార్పణ, ధ్వజారోహణ, పూర్ణ కలశ స్థాపన, దీపాలంకరణ స్వామివారికి జరుగుతుందని, శుక్రవారం కలశారాధన, నృసింహస్వామి పూజలతో పాటు మండపారాధనలు, శనివారం పంచదేవతా పూజలు, ఆదివారం అక్షర తదియ నాడు కలశారాదన, సహస్ర పట్టాభిషేకం, స్వామివారికి పంచామతాభిషేకాలు, ఉదయం 6 గంటల నుండి సాయంకాలం 5 గంటల వరకు చందనోత్సవములో భాగంగా స్వామివారి నిజరూప దర్శనం భక్తులు కనులారా వీక్షించవచ్చునని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుందని అన్నారు.

వెల్నెస్ సెంటర్లను సందర్శించిన డిఐఒ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోనిగవరంపేట, పెద మేరంగి, అల్లువాడ, తుంబలి, శిఖబడి గ్రామాల్లో హెల్త్ వెల్నెస్ కేంద్రాలను సందర్శించి వివిధ ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ రికార్డులను, ఆన్లైన్ నమోదు వివరాలను గురువారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావుపరిశీలించారు. మందులు, పరీక్షల స్టాకు వివరాలు పరిశీలించి ఎప్పటికప్పుడు అవసరమైన వైద్య సదుపాయాలన్ని అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచనలు చేశారు. ప్రతినెలా జరిగే 7, 8 తేదీల్లో ప్రి పిఎమ్ఎస్ఎంఎ కార్యక్రమాన్ని వెల్నెస్ కేంద్రాల్లో నిర్వహించి ఎమ్ఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, గర్భిణీలకు ఆరోగ్య తనిఖీలు చేపట్టాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ రికార్డులను పరిశీలించారు. అక్కడ ఐరన్ మాత్రలు, సిరప్‌ల లభ్యత వివరాలు పరిశీలించారు. పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేసి బరువులో పురోగతి లేని పిల్లలను గుర్తిస్తే ఎన్ ఆర్ సి కేంద్రాలకు రిఫర్ చేయాలని సూచించారు. అనంతరం ఆయన జియ్యమ్మవలస పిహెచ్‌సిని సందర్శించి సిబ్బందితో సమీక్షించి ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి నివేదికలను పరిశీలించారు. వెనుకబడిన వాటిలో పురోగతి సాధించేలా చర్యలు చేపట్టాలని వైద్యాధికారి, సూపర్‌వైజర్లకు డిఐఒ సూచనలు చేశారు. వేసవి రీత్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, అన్ని గ్రామాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు , జింక్ మాత్రలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సిబ్బంది సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.తిరుపతిరావు, సూపర్ వైజర్స్ పి.విజయ, జయగౌడ్, ఫార్మసిస్ట్ దిలీప్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వెలగవాడ సచివాలయాన్ని సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

మండలంలోని వెలగవాడ సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాధులు గురువారం సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టితో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు.